నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 11 జనవరి 2024 | KHAMMAM

ప్రతి హామీని నెరవేరుస్తాం

- అన్యాక్రాంతమైన ప్రభుత్వ ఆస్తులను కాపాడుతాం
- వానకాలం నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు
- ఈ నెలాఖరు వరకు అన్నదాతలకు రైతుబంధు అందిస్తాం
- కూసుమంచి సమావేశంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి

కూసుమంచిలో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కూసుమంచి, జనవరి 10: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని, ఆరు గ్యారెంటీల అమలులో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మాట నిలబెట్టుకొని వంద రోజుల్లో వాటిని పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ ఆస్తులను కాపాడుతామని అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో తొలుత ఆయన మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ అవుతున్నాయని అన్నారు. అవి పూర్తయిన వెంటనే అధికారులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండు రోజుల్లోనే రెండు హామీలను నెరవేర్చామని, మిగిలిన హామీలను దశల వారీగా అమలు చేస్తామని అన్నారు. తమ హామీలన్నీ ఆచరణ సాధ్యమైనవేనని అన్నారు.

వానకాలం నాటికి గోదావరి జలాలు: తుమ్మల

వానకాలం నాటికి ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాలను అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీతారామ ప్రాజక్టుతో ఉమ్మడి జిల్లాలోని 10 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్పష్టమైన ఆలోచనలో ఉందని అన్నారు. వైరా, లంకాసాగర్‌ల కింద ఆయకట్టుకు వచ్చే వానకాలం నాటిని గోదావరి జలాలను అందిస్తామని అన్నారు. అలాగే ఈ నెల ఆఖరు నాటికి రైతుల ఖాతాల్లో రైతుబంధు సాయాన్ని జమ చేస్తామని అన్నారు. సీతారామ ప్రాజెక్టుతో పాలేరును అనుసంధానం చేయడం వల్ల నాగార్జున సాగర్‌తో పని లేకుండానే గోదావరి జలాలతో జిల్లాను సమశ్యామలం చేయాలనేదే తన జీవిత లక్ష్యమని అన్నారు. అందుకోసం మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌లతో కలిసి సమీక్షించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూర్తిగా నివేదిక ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో పూర్తిగా పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. నిధుల విషయంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కతో చర్చించినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన కలెక్టర్, సీపీ..

కూసుమంచిలో నూతనంగా ప్రారంభమైన మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటిని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సుమారు 20 నిమిషాల పాటు మంత్రితో వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలి

ఖమ్మం ఏఎంసీ పరిశీలనలో అదనపు కలెక్టర్ మధుసుదన్‌నాయక్

మిర్చి పంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం వ్యవసాయం, జనవరి 10: మిర్చి రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసుదన్‌నాయక్ అధికారులకు సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డును బుధవారం ఆయన సందర్శించి మిర్చి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చి ధర తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరైన తేమ, నాణ్యత ఉన్న పంటను విక్రయానికి తెచ్చి రైతులు కూడా మంచి ధరను పొందాలని సూచించారు. జిల్లాలో 2023-24 సంవత్సరంలో ఉద్యాన శాఖ అంచనా ప్రకారం 92,274 ఎకరాల్లో మిర్చి సాగు చేసినట్లు, 23లక్షల క్వింటాళ్ల మిర్చి దిగుబడి రానున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్ కమిటీలకు 66,840 క్వింటాళ్ల మిర్చి పంటను ఖరీదుదారులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. పీడీ ఎంఐపీ రమణ, డీఎంవో అలీమ్, మార్కెట్ కార్యదర్శి బజార్ తదితరులు పాల్గొన్నారు.

పందెం కోడి రెడీ

ఆంధ్రా సరిహద్దుల్లో సిద్ధమైన బరులు
సై.. అంటే.. సై అంటూ రంగంలోకి జూదరులు
కొందరు ఆంధ్రా ప్రాంతాల్లోకీ టూర్
చేతులు మారనున్న రూ.వేలు.. రూ.లక్షలు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 10 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి వచ్చేస్తున్నది.. పల్లెకు పండగ శోభను తీసుకొస్తున్నది. బతుకుదెరువుకు ఊళ్లు దాటిన వారంతా తిరిగి స్వగ్రామాలకు వచ్చే వేళైంది. ఇంటిల్లిపాదీ సందడిగా గడిపే తరుణం వచ్చేసింది. అంతేనా.. కోడి పందేలకు బరులు సిద్ధమయ్యే సమయం ఆసన్నమైంది. భద్రాద్రి జిల్లాలోని ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లోని కొన్నిచోట్ల ఇప్పటికే బరులు సిద్ధమయ్యాయని సమాచారం. ఎన్ని చట్టాలు ఉన్నా.. ఎన్ని నిబంధనలు ఉన్నా.. ఏటా సంక్రాంతి సమయంలో పందేలు జరుగుతూనే ఉన్నాయి. ఢీ అంటే ఢీ అంటే పందెరాయుళ్లు బరిలోకి కోళ్లను వదులుతున్నారు.

కోడి పందేలకు కేరాఫ్ ఆంధ్రా..

కోడి పందేలు అనగానే ఎవరికైనా ఆంధ్రానే గుర్తుకొస్తుంది. పూర్వకాలంలో జమీందార్లు, దొరలు ఎక్కువగా సంక్రాంతి సమయంలో వారు ఏలుతున్న ప్రాంతాల్లో కోడి పందేలు ఆడేవారు. ఈ పందేలను వారు ప్రతిష్ఠగా భావించేవారు. పందెంలో గెలిచిన కోడిని ప్రాణప్రదంగా చూసుకునేవారు. ఓడిపోయిన కోడిని వండి వార్చి తమ కుటుంబ సభ్యులు, వందీమాగధులకు పెట్టేవారు. ఆ పందేలు ఎలా.. ఎందుకు.. ఇప్పటికీ కొనసాగుతున్నాయో తెలియదు గానీ.. ఏటా క్రేజ్ మాత్రం పెరుగుతూనే ఉన్నది. జిల్లాలోని పాల్వంచ, దమ్మపేట, అశ్వారావుపేట, చంద్రుగొండ మండలాల ఏటా కోడి పందేలు జరుగుతున్నాయి. ఆంధ్రాప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ పందేలు ఎక్కువ. ఏటా సంక్రాంతి సమయంలో భద్రాద్రి జిల్లా నుంచి వందలాది మంది జూదరులు ఆంధ్రా ప్రాంతంలోని భీమవరం, రాజమండ్రి, వీఆర్‌పురం, చింతూరు, కూనవరం, వేలేరుపాడు, కుక్కునూరుకు వెళ్తుంటారు. పందేలకు అధికారికంగా అనుమతులు లేకపోయినప్పటికీ రాజకీయ నాయకులు ఒత్తిళ్లకు తలొగ్గి అనధికారికంగా పందేలకు పచ్చజెండా ఊపుతారనేది బహిరంగ రహస్యమే.

పందెం కోళ్లకు ఫుల్ గిరాకీ..

సంక్రాతి వచ్చిందంటే చాలు జిల్లా సరిహద్దుల్లోని సంతలు జోరుగా సాగుతాయి. అక్కడ పందెం కోళ్లకు మస్త్ గిరాకీ ఉంటుంది. సుమారు ఏడాది పాటు కోళ్లను సాది యజమానులు సంతల వద్దకు వచ్చి జూదరులకు విక్రయిస్తారు. ఒక్కో కోడి సంతలో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలుకుతుంది. కాస్త ఆర్థిక స్తోమత ఉన్న జూదరుడు కనీసం నాలుగు కోళ్లను కొనుగోలు చేస్తాడు. ప్రస్తుతం జిల్లాలో కాకి, కాకి డేగ, అబ్రాస్, సవలా, నెమలి, పెట్టమారి, పూల ఇలా రంగులను బట్టి అనేక పేర్లతో పందెం కోళ్లు దొరుకుతాయి.

పందేల మాటున ఇతర జూదాలు..

బరుల వద్ద కోడి పందేలే జూదరులు వివిధ రకాల జూదాలు ఆడతారు. వీటిలో మట్కా ప్రధానమైనది. వీటిని నియంత్రించాల్సిన అధికారులు చూసీ చూడనట్లువ్యవహరిస్తుండడంతో ఐదు రోజుల పాటు జూదం ఆడి సొమ్ములు పోగొట్టుకుని తిరిగి ఇంటికి వస్తారు. జూదం ఆడి సంపాదించిన వారు వందల్లో ఒకరిద్దరు ఉంటారంతే. పందేలు రూ.10 వేల నుంచి మొదలై రూ.లక్షల వరకు వెళ్తుందనేది పెద్ద ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. బరిలో నిలిపిన కోళ్ల యజమానులు, నిర్వాహకులే కాదు. బరి బయట నించుని పందేలను చూస్తున్న సాధారణ ప్రజలూ బయట పందేలు కాస్తారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సంక్రాంతి సమయంలోనే కాక సాధారణ రోజుల్లోనూ గుట్టుచప్పుడు కాకుండా కోళ్ల పందేల స్థావరాలు నడుస్తాయి. ఏటా పదుల సంఖ్యలో పోలీసులు వాటిపై దాడులు చేస్తారు. జూదరులపై కేసులు సైతం నమోదు చేస్తారు. ఈసారి కూడా సంక్రాంతి మేనియా రానే వచ్చింది. ఇక పోలీసులు కోడి పందేల బరిలోకి దిగి కత్తి కడతారో.. కట్టడి చేస్తారో.. అనేది వేచి చూడాల్సిందే.

ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వీ.పీ గౌతమ్

మామిళ్లగూడెం, జనవరి 10 : ఖమ్మం జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్, బుగ్గవాగు సాగు నీటి ప్రాజెక్టుల భూ సేకరణపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పాలేరు లింక్ కాల్వ క్రింద చేపట్టాల్సిన 1,717.35 ఎకరాలకు 1,570 ఎకరాల భూ సేకరణ పూర్తి చేసి అవార్డ్ పాస్ చేయడం జరిగిందని తెలిపారు. శ్రీరామ్ సాగర్ ప్యాకేజి-53, ప్యాకేజి-54కు జిల్లా పరిధిలో ఇంకా 34.20 ఎకరాల భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఈ భూ సేకరణ పనులు పూర్తి చేసి, పాలేరుకు గోదావరి జలాలను తరలించేందుకు చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్ కాల్వకు 325.30 ఎకరాల భూ సేకరణ పూర్తి చేసి అవార్డ్ పాస్ చేశామన్నారు. మున్నేరు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ నిమిత్తం వ్యవసాయ, వ్యవసాయేతర భూమి ఎంత సేకరించాలో నివేధిక సమర్పించాలన్నారు. వ్యవసాయేతర భూమిని గజాల్లో, వ్యవసాయ భూమిని ఎకరాల్లో చూపాలన్నారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై గ్రామాల వారీగా సమీక్ష చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, డిప్యూటీ సీఈ ధన్‌కుమార్ రెడ్డి, ఎస్ఈలు ఆనంద్, శ్రీనివాసరెడ్డి, ఆర్డీవోలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఈఈలు, కలెక్టరేట్ భూ సేకరణ విభాగ పర్యవేక్షకులు రంజిత్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- గురుకులాల డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి
- ముగిసిన ఇగ్నైట్ ఫెస్ట్

వేడుకల్లో పాల్గొన్న గురుకులాల రాష్ట్ర స్థాయి అధికారులు

భద్రాచలం, జనవరి 10 : విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని, తల్లిదండ్రుల ఆశలు తీర్చాలని తెలంగాణ రాష్ట్ర గురుకులాల డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాచలం గిరిజన గురుకుల విద్యాసంస్థలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ స్టేట్ ఇగ్నైట్ ఫెస్ట్ ఇతోస్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు వేడుకలో గిరిజన గురుకులాల ఓఎస్డీ, సీఈఎస్ సుమలత, భద్రాచలం ఆర్సీవో వెంకటేశ్వర రాజు, వరంగల్ ఆర్సీవో డీఎస్ వెంకన్న, ఇతర జిల్లాల ఆర్సీవోలతో పాటు భద్రాచలం ప్రిన్సిపాల్ మెండెం దేవదాస్, వివిధ పాఠశాలల, కళాశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

మణుగూరు రైల్వే స్టేషన్‌ను సందర్శించి పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

కొత్తగూడెం టౌన్/ సత్తుపల్లి టౌన్/ భద్రాచలం, జనవరి 10: రైల్వేశాఖ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తుందని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన ప్రత్యేక రైలులో సికింద్రాబాద్ నుంచి భద్రాచలం రోడ్ సెక్షన్‌కు చేరుకున్నారు. రైల్వే శాఖ అధికారులు సూచనలు సలహాలిచ్చారు. తొలుత భద్రాచలంలోని రామచంద్రస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మణుగూరు రైల్వే స్టేషన్, చంద్రుగొండ రైల్వేస్టేషన్లను సందర్శించారు. అనంతరం సత్తుపల్లి చేరుకుని సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను పరిశీలించారు. రైల్వే సైడింగ్‌ను తనిఖీ చేశారు. రైళ్ల ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణాపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత సికింద్రాబాద్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందన్న విషయం తెలుసుకుని కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వేస్టేషన్‌ను సందర్శించకుండానే సికింద్రాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సౌత్ సెంట్రల్ జీఎం వెంట సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేశ్‌కుమార్, సీనియర్ డీవోఎం సురేశ్‌రెడ్డి, బీడీసీఆర్ ఏవో రజనీష్‌మీనా, సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు ఉన్నారు.

ఆయిల్‌ఫెడ్ నిర్వాకం

- జీవో జారీ కాకుండానే కొత్త ఫార్ములా అమలు
- అభ్యంతరం వ్యక్తం చేసిన రైతు సంఘం నేతలు
- పాత ఫార్ములాతోనే రైతులకు చెల్లింపులు

పామాయిల్ తోటలో గెలలు సేకరిస్తున్న కూలీ (ఫైల్)



అశ్వారావుపేట, జనవరి 10: పామాయిల్ రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూడబోయింది. రైతు సంఘం నేతలు అభ్యంతరం చెప్పడంతో వెనుకడుగు వేసింది. ఏటా పామాయిల్ గెలల ధరను ఫార్ములా ప్రకారం చెల్లిస్తుంటారు. ఫార్ములా అమలుకు ప్రభుత్వం జీవో జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఫార్ములాను ప్రభుత్వం ప్రకటించినప్పటికీ జీవో జారీ చేయలేదు. కానీ గెలల ధరల చెల్లింపులు మాత్రం కొత్త ఫార్ములా ప్రకారం చెల్లించాలని ఉద్యాన శాఖ అధికారులు, టీఎస్ ఆయిల్‌ఫెడ్ అధికారులు ప్రయత్నించారు. రైతు సంఘం నేతలు గమనించి అభ్యంతరం వ్యక్తం చేశారు. గత్యంతరం లేక అధికారులు పాత ఫార్ములా ప్రకారం రైతులకు ధరను చెల్లించారు.

నవంబర్ నెల నుంచి ఆయిల్ ఇయర్‌గా తీసుకుని ఆయిల్‌ఫెడ్ బాధ్యులు, ఉద్యాన శాఖ అధికారులు ధర చెల్లింపునకు ఫార్ములా నిర్ణయిస్తారు. నిరసుడు 19.32 శాతం ఆధారంగా గెలల ధరను అధికారులు చెల్లించారు. ఈ ఏడాది ఫార్ములా 19.02 శాతానికి తగ్గింది. ఈ ఫార్ములా ప్రకారం గెలల ధర కూడా తగ్గుతుంది. అయితే ఫార్ములా ప్రకటించిన టీఎస్ ఆయిల్‌ఫెడ్ అధికారులు ప్రభుత్వం నుంచి జీవో జారీ కాకుండానే గెలల ధరను చెల్లించే ప్రయత్నం చేశారు. టన్ను ధర రూ.12,448 చొప్పున చెల్లింపులు మొదలుపెట్టారు. కొత్త ఫార్ములా ప్రకారం ఒక్కో టన్నుకు రైతులు సుమారు రూ.200 నుంచి రూ.250 వరకు నష్టపోతారు. ప్రభుత్వం జీవో జారీ చేయలేదు కాబట్టి పాత ఫార్ములా ప్రకారం గెలల ధర చెల్లించాలని ఆయిల్‌పాం గ్రోవర్స్ అసోషియేషన్ డిమాండ్ చేయటంతో వెనక్కి తగ్గిన టీఎస్ ఆయిల్‌ఫెడ్.. పాత ఫార్ములా ప్రకారం గెలల ధరను చెల్లించేందుకు అంగీకరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ నేతృత్వంలో నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావులను కలిసి పాత ఫార్ములా ప్రకారం గెలల ధర చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. దీంతో గెలల టన్ను ధరను నిరుడు నవంబర్‌లో రూ.12,619, డిసెంబర్‌లో రూ.12,627 చొప్పున చెల్లించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. నవంబర్‌లో జరగాల్సిన గెలల ధర నిర్ణాయక సమావేశం ఎన్నికల కారణంగా వాయిదా పడింది. సమావేశాన్ని ఈ ఏడాది జనవరిలో అధికారులు నిర్వహించారు. ఫార్ములాను ప్రకటించినప్పటికీ ఉద్యాన శాఖ నుంచి జీవో విడుదల కాకపోవడంతో కొత్త ఫార్ములా ఇంకా అమల్లోకి రాలేదు. అధికారులు మాత్రం గెలల ధర చెల్లింపులకు ప్రయత్నించారు. కొత్త ఫార్ములాతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని గమనించిన సంఘం నేతలు.. జీవో జారీ కాకుండా కొత్త ఫార్ములాను ఎలా అమలు చేస్తారంటూ నిలదీశారు. రైతులకు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని కాబట్టి పాత ఫార్ములా ప్రకారమే ధర చెల్లించాలని పట్టుబట్టారు. లేదా ధర తగ్గుతున్న దృష్ట్యా రైతులకు నష్టం లేకుండా ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను పెంచాలని కోరారు. రైతు సంఘం ఒత్తిడితో అధికారులు పాత ఫార్ములా ప్రకారం చెల్లింపులు జరుపుతున్నారు. రవాణా చార్జీలను పెంచిన తర్వాతే కొత్త ఫార్ములాను ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్‌ఫెడ్ అధికారులు అమలు చేస్తారని రైతు సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతులు నష్టపోకుండా ఆయిల్‌ఫెడ్ అధికారులు ఫార్ములాను అమలు చేయాలని సూచిస్తున్నారు.

జీవో జారీ కాకుండా చెల్లింపులు సరికాదు..

రైతులకు గెలల ధర నిర్ణయించేందుకు ఆయిల్‌ఫెడ్ ఫార్ములాను ప్రకటిస్తుంది. ప్రభుత్వం జీవో జారీ చేసిన తర్వాతే ఫార్ములా అమలవుతుంది. కానీ ఆయిల్‌ఫెడ్ అదికారులు జీవో విడుదల కాకుండా రైతులకు ఆర్థిక నష్టం చేకూర్చే విధంగా కొత్త ఫార్ములా ప్రకారం గెలల ధర చెల్లించాలని ప్రయత్నించారు. ఆ విషయాన్ని ముందుగానే గమనించి సంఘం తరపున అభ్యంతరం చెప్పడంతో అధికారులు వెనక్కి తగ్గారు. పాత ఫార్ములా ప్రకారం గెలల ధరను చెల్లిస్తున్నారు. లేకుంటే రైతులు టన్నుకు రూ.200 నుంచి రూ.250 వరకు నష్టపోయే పరిస్థితి ఉండేది.

–ఆలపాటి రామచంద్ర ప్రసాద్, పామాయిల్ గ్రోవర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, దమ్మపేట

పాత ఫార్ములా ప్రకారము చెల్లింపులు..

ఈ ఏడాది గెలల ధర చెల్లింపునకు సంస్థ అధికారులు 19.02 శాతం ప్రకారం ఫార్ములాను నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి జీవో విడుదల కావాల్సి ఉంది. రైతులకు గెలల ధర చెల్లింపులో ఆలస్యం కావడం వల్ల కొత్త ఫార్ములా ప్రకారం ధర చెల్లించడానికి చర్యలు తీసుకున్నాం. కానీ రైతు సంఘం నాయకుల అభ్యంతరంతో పాత ఫార్ములా ప్రకారం గెలల ధరను చెల్లిస్తున్నాం. ప్రభుత్వం జీవో జారీ చేసిన తర్వాతే కొత్త ఫార్ములాను అమలు చేస్తాం.

–ఆకుల బాలకృష్ణ, టీఎస్ ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్, అశ్వారావుపేట

చెట్టుపై ఆడుతున్న విద్యార్థులు

సార్ బాగా బిజీ..!

పత్తి చేనులో విద్యార్థులు

తరగతి గదిలో ఉండాల్సిన విద్యార్థులు రోజంతా పత్తి చేను, చెట్లపై ఆటలాడుతూ కనిపించారు. వివరాల్లోకెళ్తే.. దుమ్ముగూడెం మండలం ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన లింగాపురం పాఠశాల ఏకో ఉపాధ్యాయ పాఠశాల. ఇక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయుడు సెలవులో ఉండడంతో ప్రత్యామ్నాయంగా మరో టీచర్ విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో టీచర్ తన సొంత పనులపై బడిని వదిలివెళ్లిపోయాడు. దీంతో విద్యార్థులు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాలు, పత్తి చేనులో ఆడుకున్నారు. అయితే పిల్లలకు ఏదైనా జరగరానిది జరిగితే పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏటీడబ్ల్యూ నరసింహారావును వివరణ కోరగా పూర్తి విచారణ చేసి ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. – పర్ణశాల, జనవరి 10

-మిగతా వార్తలు 6వ పేజీలో..